ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

నల్లగొండ

5

శుక్రవారం 26 జూలై 2024

గరిష్ఠం 29.5
కనిష్ఠం 23.0
***



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	504.20 (122.0883)	29,125	6,500
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	642.50 (3.69)	1,189	300
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	102.45 (0.99)	628	నిల్

చికెన్ ధరలు	లైవ్ : రూ.126	డ్రెస్ : రూ.184	స్కిన్‌లెస్ : రూ.210

ప్రాజెక్టులకు మహర్దశ

- రెండేళ్లలో పూర్తికి బడ్జెట్‌లో భరోసా
- మహిళాసాధికారతకు పెద్దపీట
- ట్రిపుల్‌ఆర్, మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టులు
- నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు
- రైతులకు అగ్రతాంబూలం





రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థికశాఖమంత్రి మల్లు భట్టివిక్రమార్క 2024-25 ఆర్థిక సంవత్సరానికి గురువారం శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్ ఎన్నికల హామీలను అమలుచేసే దిశగా కన్పిస్తోంది. అభయహస్తం ఆరు గ్యారెంటీల్లో పేర్కొన్న పథకాలన్నింటికీ ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. మహిళాసాధికారతకు పెద్దపీట వేస్తూ పలు పథకాలు, కార్యక్రమాలను ప్రకటించారు. రైతు కేంద్రంగా ఇప్పటికే అమలుచేస్తున్న రూ.2లక్షల రుణమాఫీ పథకానికి నిధుల కేటాయింపులతో పాటు రైతుభరోసా, పంటలబీమా పథకం, ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించారు.

● ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ



అసెంబ్లీలో బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్న డిప్యూటీ సీఎం మల్లుభట్టి విక్రమార్క

పేదల సొంతింటి కలను నెరవేర్చే క్రమంలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని పునరుద్ధరిస్తున్నట్టు ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క వెల్లడించారు. నిర్మాణంలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను ఏడాది, గరిష్ఠంగా రెండేళ్ల గడువులోగా పూర్తిచేస్తామనే లక్ష్యంతో ప్రభుత్వం ఉండగా, జిల్లాలోని ఎస్‌ఎల్‌బీసీ, డిండి ఎత్తిపోతల పథకాలకు మోక్షం లభించనుంది. రాష్ట్రానికే తలమానికంగా ఉన్న ఉమ్మడి జిల్లాకు కీలకమైన రీజనల్ రింగ్‌రోడ్డు, మూసీ రివర్‌ఫ్రంట్ పథకాలకు ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. ఎకోటూరిజం ప్రాజెక్టులకు ప్రాధాన్యమిస్తూ అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌ఫారెస్ట్ పరిధిలోని నాగార్జునసాగర్, దేవరకొండ రేంజ్‌లలో ఎకోటూరిజం కింద హోటళ్లు, పార్కులు, టూరిజం కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది.

సాగునీటి ప్రాజెక్టులకు అగ్రతాంబూలం

రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులను నిర్దిష్ట గడువులోగా పూర్తిచేసే లక్ష్యాన్ని బడ్జెట్‌లో ప్రకటించారు. జిల్లాలోని కీలకమైన ఎస్‌ఎల్‌బీసీ సొరంగ మార్గాన్ని, డిండి ఎత్తిపోతల పథకాన్ని రెండేళ్ల గడువులోగా, ఉదయసముద్రం-బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టును ఏడాది గడువులోగా పూర్తిచేసే ప్రాజెక్టుల జాబితాలో చేర్చారు. ఎస్‌ఎల్‌బీసీకి గ్రీన్‌ఛానల్‌లో రూ.2,203కోట్ల నిధులను అందుబాటులో ఉంచారు. మరో వైపున ఉమ్మడి జిల్లాలోని కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని పెండింగ్ పనులకు, ఎత్తిపోతల పథకాలకు, ఎస్‌ఆర్‌ఎస్పీ మరమ్మతులకు నిధులు కేటాయించారు.

మూసీ రివర్‌ఫ్రంట్, రీజనల్ రింగ్‌రోడ్డు

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా పేర్కొంటున్న మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును చేపట్టనుంది. ఈ పథకానికి రూ.1,500కోట్లు కేటాయించింది. మూసీ నదిని ప్రక్షాళన చేయడంతో పాటు, సుందరీకరణ చేపట్టడం ద్వారా హైదరాబాద్ మహానగరంతో పాటు మూసీ పరివాహకంలో ఉన్న నల్లగొండ, యాదాద్రి, సూర్యాపేట జిల్లాల భూములకు, నీటి వనరులకు, మత్స్యసంపదకు కాలుష్యం బెడద తప్పనుంది. ఈ ప్రాజెక్టుకు దాదాపు రూ.1లక్ష కోట్ల వరకు వ్యయం కానుండగా, పథకం చేపట్టే తీరుపై స్పష్టత రావాల్సి ఉంది. మరో కీలకమైన ప్రాజెక్టుగా భావిస్తున్న రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. ఈ పథకానికి రూ.1,525 కోట్లను బడ్జెట్‌లో కేటాయించారు. ఈ పథకంలో దక్షిణభాగంలో ఉమ్మడి జిల్లాలోని చౌటుప్పల్, మర్రిగూడ, సంస్థాన్‌నారాయణపురం మండలాల మీదుగా ట్రిపుల్‌ఆర్ వెళ్లనుంది. తొలుత నాలుగు లేన్ల రహదారిగా, ఆ తరువాత ఎనిమిది లేన్ల రహదారి విస్తరణకు అనుగుణంగా భూసేకరణ చేపడతామని ప్రకటించారు. ఈ పథకం అమల్లోకి వస్తే ఓఆర్ఆర్, ట్రిపుల్‌ఆర్ నడుమ పారిశ్రామిక, వాణిజ్యవాడలు ఏర్పాటవుతాయని, తద్వారా ఆర్థిక వృద్ధికి కేంద్రంగా మారుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

ఐటీఐల ఆధునికీకరణకు నిధులు

ఐటీఐలను ఉద్యోగ కల్పనా కేంద్రాలుగా మార్చేందుకు శ్రీకారం చుట్టిన ప్రభుత్వం అందుకోసం ఐటీఐల ఆధునికీకరణకు రూ.300కోట్లను ఈ బడ్జెట్‌లో కేటాయించింది. ఉమ్మడి జిల్లాలోని ఏడు ప్రభుత్వ ఐటీఐలను ఇప్పటికే ఈ ప్రాజెక్టు పరిధిలోకి తీసుకురాగా, ఈ ఐటీఐలలో ఆధునిక కోర్సులు, బ్రాంచ్‌లు, సదుపాయాలు కల్పించనున్నారు. యువతకు నైపుణ్య శిక్షణతో పాటు కోర్సు పూర్తయిన వెంటనే ఐటీ, పారిశ్రామిక సంస్థల్లో ఉద్యోగాలు లభించే హామీతో ఏటీసీ (అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లు)లు పనిచేయనున్నాయి.

నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు

ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు ఇందిరమ్మ ఇళ్ల పథకానికి బడ్జెట్‌లో కేటాయింపులు చేశారు. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి ఈ ఏడాది 3,500 ఇళ్ల చొప్పున కేటాయించారు. దీంతో ఉమ్మడి జిల్లాలో 42వేల పేద కుటుంబాలకు సొంతింటి కల నెరవేరనుంది. సొంత స్థలం ఉన్న పేదలు డిజైన్‌తో సంబంధం లేకుండా కనీస ప్రమాణాలతో సీసీ ఇల్లు నిర్మించుకుంటే ఈ పథకం కింద రూ.5లక్షల ఆర్థిక సహాయం ప్రభుత్వం అందజేయనుంది. ఎస్సీ, ఎస్టీలకు రూ.6లక్షల మొత్తం ఇవ్వనుంది.

ఎకో టూరిజంలో 'టైగర్' ప్రాజెక్టుకు చోటు

రాష్ట్ర వ్యాప్తంగా పర్యావరణ సహిత ఎకో టూరిజాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక పాలసీని ప్రకటించింది. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్టును ఈ పథకం కింద చేర్చడంతో జిల్లాలోని నాగార్జునసాగర్, దేవరకొండ ప్రాంతాల్లో ఎకో టూరిజం అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులు రానున్నాయి. టూరిజం హోటళ్లు, టూరిజం కేంద్రాలను ఈ పథకం కింద ఏర్పాటు చేయనున్నారు.

ధాన్యానికి రూ.500 బోనస్



రైతులకు పెద్దపీట వేసిన ప్రభుత్వం ఇప్పటికే రుణమాఫీ పథకం అమలు చేస్తుండగా, రైతుల నుంచి స్వీకరించిన అభిప్రాయాలు, క్యాబినెట్ సబ్‌కమిటీ తుదినిర్ణయం తర్వాత రైతుభరోసా పథకాన్ని అమలులోకి తేనుంది. అంతేగాకుండా ప్రకృతి వైపరీత్యాలు తలెత్తినప్పుడు ఆదుకునేందుకు వీలుగా పంటల బీమా పథకాన్ని అమలు చేయనున్నట్టు ప్రకటించింది. కేంద్రం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఫసల్ బీమాయోజన ద్వారా ఈ పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయనుంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఈ ఏడాది నుంచి ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ ఇవ్వనుంది.


మహిళా సంఘాలకు ఆర్థిక భరోసా





మహిళా స్వయం సహాయక సంఘాలకు రానున్న ఐదేళ్లలో వడ్డీలేని రుణాల పథకాన్ని కొనసాగిస్తామని బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి ప్రకటించారు. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో మహిళలకు ప్రత్యేక చిన్నతరహా ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రంలో కోటిమంది మహిళలను రానున్న ఐదేళ్లలో కోటీశ్వరులను చేసేందుకు ఔత్సాహిక పారిశ్రామిక పథకం కింద రుణాలనందించనున్నారు. వీటితో పాటు స్వయం సహాయక సంఘాల్లో సభ్యులైన మహిళలు మృతిచెందితే గరిష్ఠంగా రూ.2లక్షల లోపు రుణం ఉంటే రద్దు కానున్నాయి. మహిళా సంఘాల సభ్యులకు రూ.10లక్షల జీవితబీమా సదుపాయం కూడా ప్రభుత్వం కల్పిస్తోంది.

జనరంజకంగా రాష్ట్ర బడ్జెట్



నల్లగొండ: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ జనరంజకంగా ఉంది. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ఈ బడ్జెట్ రూపొందించారు. ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ ఈ ఐదేళ్లలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తుంది. వ్యవసాయ రంగానికి పెద్దపీట వేశారు. సాగునీటి ప్రాజెక్టులకు బడ్జెట్‌లో కేటాయింపులు భారీగా ఉన్నాయి. దీంతో పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తికానున్నాయి. బడుగు, బలహీన వర్గాలు, మైనార్టీల సంక్షేమానికి కేటాయింపులు పెంచారు. సంక్షేమం, అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని బడ్జెట్ రూపొందించడం సంతోషకరం.

● శంకర్‌నాయక్, డీసీసీ అధ్యక్షుడు


బడ్జెట్‌లో జిల్లాకు వచ్చింది గాడిద గుడ్డే



కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో జిల్లాకు వచ్చింది గాడిద గుడ్డే. సొరంగమార్గం, డిండి ఎత్తిపోతల పథకం, బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టులకు నిధులు కేటాయించలేదు. నిధులను గ్రీన్‌ఛానల్ ద్వారా చేపట్టి సత్వరమే పూర్తి చేయాలి. ఉమ్మడి జిల్లా నుంచి కాంగ్రెస్ పార్టీకి 11మంది ఎమ్మెల్యేలను గెలిపిస్తే ఎలాంటి కేటాయింపులు చేయలేదు. తక్షణమే జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు రాజీనామా చేయాలి. మహిళలకు స్కూటీతో పాటు రూ.2,500 ఇస్తామని చెప్పి హామీని నెరవేర్చలేదు. హెల్త్‌కేర్ విషయంలో కూడా ఎలాంటి కేటాయింపులు లేవు. మహిళలకు, రైతులకు, నిరుద్యోగ, యువతీ, యువకులకు ఈ బడ్జెట్‌లో ఎలాంటి ఊరట లేదు.

● నాగంవర్షిత్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

బడ్జెట్ అంకెల గారడీ



రాష్ట్ర బడ్జెట్ పూర్తిగా అంకెల గారడీ. కేవలం ప్రజలను మభ్యపెట్టే బడ్జెట్. రైతుభరోసా, రుణమాఫీపై స్పష్టత లేదు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ఈ బడ్జెట్‌లో ఎలాంటి స్పష్టత లేదు. సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించే విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధిగా వ్యవహరించలేదు. అన్ని వర్గాల ప్రజలను మోసం చేసేలా బడ్జెట్‌ను రూపొందించారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ఆందోళన కార్యక్రమాలు చేపడతాం.

రమావత్ రవీంద్రకుమార్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు

వెనుకబడిన ప్రాంతాలను విస్మరించారు



రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ కేటాయింపులు ప్రజా సంక్షేమానికి ఖర్చు చేయాలి. గత ప్రభుత్వం మాదిరిగానే వెనుకబడిన ప్రాంతాలను బడ్జెట్‌లో విస్మరించారు. ఆరు గ్యారెంటీల అమలుపై ఉన్న చిత్తశుద్ధి మిగిలిన ప్రజా సమస్యలపై కాంగ్రెస్‌కు లేదు. రైతు భరోసా, రైతుబీమా ఎప్పటి వరకు అమలు చేస్తారనేది నిర్దిష్టంగా పేర్కొనలేదు. సొరంగ మార్గానికి, మూసీకి ప్రత్యేక నిధులు కేటాయించాలి. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో అంతర్భాగమైన డిండి ఎత్తిపోతల పథకం డీపీఆర్‌ను ఆమోదిస్తామని ఎలాంటి ప్రకటన చేయకపోవడం బాధకరం.

ముదిరెడ్డి సుధాకర్, సీపీఎం జిల్లా కార్యదర్శి

ప్రత్యేక నిధులు కేటాయించలేదు



జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులకు ముఖ్యంగా ఎస్‌ఎల్‌బీసీ సొరంగమార్గం పూర్తికి ప్రత్యేక నిధులు కేటాయించలేదు. గత ప్రభుత్వంలో సొరంగమార్గం, నక్కలగండి, డిండి ఎత్తిపోతల పథకం, చర్లగూడ రిజర్వాయర్‌పై వివక్ష చూపింది. అందుకు భిన్నంగా ప్రస్తుత ప్రభుత్వం ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇస్తే బాగుండేది. విద్య, వైద్య కోసం కూడా సరైన నిధులు కేటాయించలేదు.

నెల్లికంటి సత్యం, సీపీఐ జిల్లా కార్యదర్శి

సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలి



ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నందున సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలి. శ్రీశైలం సొరంగమార్గం, నక్కలగండి, డిండి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి సాగు, తాగునీరు అందించాలి. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ ప్రభుత్వం నెరవేర్చాలి. నిరుద్యోగ యువతీ, యువకులను ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఉంది.

కసిరెడ్డి శేఖర్‌రెడ్డి, టీడీపీ నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు

మూసీ కుడి, ఎడమ కాల్వలకు నీటి విడుదల


- 642అడుగులకు చేరిన మూసీ నీటిమట్టం
- విడుదల చేసిన ఎమ్మెల్యేలు వీరేశం, లక్ష్మారెడ్డి



మూసీ నీటిని విడుదల చేస్తున్న ఆర్డీఆర్, వేముల వీరేశం, బత్తుల లక్ష్మారెడ్డి

కేతేపల్లి, జూలై 25: మూసీ జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టానికి చేరువవడంతో వానాకాలం సీజన్ పంటల సాగుకు గురువారం రాత్రి కుడి, ఎడమ కాల్వలకు నీటిని విడుదల చేశారు. ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో నిలకడగా కొనసాగుతుండడంతో మూసీ ప్రాజెక్టు నీటిమట్టం 642అడుగులకు చేరింది. 645అడుగుల(4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు నీటిమట్టం క్రమంగా ఒక్కో అడుగు పెరుగుతూ వచ్చి గురువారం సాయంత్రానికి 642.05అడుగులు (3.69టీఎంసీ)లుగా నమోదైంది. ఎగువనుంచి ప్రాజెక్టులోకి ప్రస్తుతం 1,189క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ఈ ఏడాది భారీ వర్షాలు లేకున్నా ప్రాజెక్టు 645 అడుగుల పూర్తి స్థాయి నీటిమట్టానికి చేరువవడంతో గురువారం రాత్రి మాజీ మంత్రి ఆర్.దామోదర్‌రెడ్డితో కలిసి నకిరేకల్, మిర్యాలగూడ ఎమ్మెల్యేలు వేముల వీరేశం, బత్తుల లక్ష్మారెడ్డి నీటిని విడుదల చేశారు. కుడికాల్వకు(నల్లగొండ జిల్లా పరిధిలోని ఆయకట్టు) 150 క్యూసెక్కులు, ఎడమకాల్వకు(సూర్యాపేట జిల్లా పరిధిలోని ఆయకట్టు) 150క్యూసెక్కులు మొత్తంగా 300 క్యూసెక్కుల నీటిని కాల్వలకు విడుదల చేస్తున్నారు. వానాకాల సీజన్ పంటల సాగు కోసం మూసీ ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలకు విడుదల చేస్తున్న నీటిని దుర్వినియోగం చేయకుండా చివరి ఆయకట్టుకు సైతం సాగునీరు అందేలా ఎగువ ప్రాంత రైతులు సహకరించాలని కోరారు.

సాగర్ ఎడమ కాల్వకు నీటి విడుదల నిలిపివేత



ఎడమకాల్వకు నిలిచిన నీటి విడుదల

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలో ఎడమ కాల్వకు గురువారం ఉదయం ప్రాజెక్టు అధికారులు నీటి విడుదలను నిలిపివేశారు. ఎడమ కాల్వ పరిధిలో ఖమ్మం జిల్లాలో ప్రజల తాగునీటి అవసరాలు తీర్చడానికి పాలేరు జలాశయం నింపేందుకు ఈ నెల 19వ తేదీ నుంచి ఎడమ కాల్వకు నీటి విడుదలను ప్రాజెక్టు అధికారులు ప్రారంభించారు. రోజుకు 3వేల క్యూసెక్కుల చొప్పున ఆరు రోజుల్లో మొత్తం 1.5టీఎంసీల నీటిని విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. గురువారం సాయంత్రానికి సాగర్ ప్రాజెక్టు నీటిమట్టం 504.20 అడుగులు(122.0338 టీఎంసీలు)గా ఉంది. సాగర్‌నుంచి కుడి కాల్వ ద్వారా 5,700 క్యూసెక్కుల నీటిని, ఎస్ఎల్‌బీసీ ద్వారా 800 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్‌నుంచి మొత్తం 6,500 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్‌ను ఉత్పత్తి చేయడం ద్వారా 29,125 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతుంది.

సాగర్‌కు 29,125 క్యూసెక్కుల నీటి రాక

నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఎగువనుంచి వరద రాక మొదలైంది. సాగర్‌కు ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టుకు కూడా భారీ స్థాయిలో వరద వస్తుండటంతో వారం రోజుల్లో 50అడుగుల మేర నీటిమట్టం పెరిగింది. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు(215.8070టీఎంసీలు) కాగా ప్రస్తుతం 855.20 అడుగులుగా (92.4860టీఎంసీలు) ఉంది. శ్రీశైలం ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తిని ప్రారంభించగా, సాగర్‌కు 29,125 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

రిజిస్ట్రేషన్లశాఖలో బదిలీలకు.. జీరో సర్వీస్?



- కేవలం సబ్ రిజిస్ట్రార్‌లకు వర్తించడం కోసమే
- ఏ క్షణమైనా ఉత్తర్వులు జారీ అయ్యే అవకాశం
- సాధారణ బదిలీలకు భిన్నంగా ఈ నిర్ణయం
- రిజిస్ట్రేషన్‌శాఖలో ప్రక్షాళన కోసమేనని చర్చ

నల్లగొండ, జూలై 25: స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖను ప్రభుత్వం సంపూర్ణంగా ప్రక్షాళించేందుకు నూతన ఆలోచనకు శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం అన్ని శాఖల్లో బదిలీలలకు రెండేళ్ల సర్వీస్ పూర్తి చేసుకోవాలన్నది నిబంధన. దీనికి భిన్నంగా రిజిస్ట్రేషన్లశాఖకు మాత్రం కొత్తగా జీరో సర్వీస్‌ను తెరపైకి తెచ్చింది. జీరో సర్వీస్‌ను రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సబ్ రిజిస్ట్రార్ల బదిలీల విషయంలో వర్తింపజేయనుంది. దీంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 15మంది సబ్ రిజిస్ట్రార్లు బదిలీ కానున్నారు. జీరో సర్వీస్‌కు సంబంధించి ఏ క్షణమైనా ఉత్తర్వులు జారీ అయ్యే అవకాశం ఉంది. అటెండర్ మొదలు అధికారుల వరకు బదిలీలను ఇతర శాఖల మాదిరిగానే నిర్వహించిన ప్రభుత్వం సబ్ రిజిస్ట్రార్ల విషయంలో మాత్రం ప్రత్యేక జీవో తీసుకురానుంది. ఈ నెలాఖరు వరకు బదిలీలకు గడువు ఉండటంతో ఈ లోగా జీవో ఇచ్చి సబ్ రిజిస్ట్రార్లందరికీ స్థానచలనం కల్పించనుంది.

ప్రక్షాళన కోసమేనా?

నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాలో మొత్తం 15 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో భువనగిరి, బీబీనగర్, చండూరు, చౌటుప్పల్, దేవరకొండ, హుజూర్‌నగర్, మిర్యాలగూడ, కోదాడ, నల్లగొండ, నిడమనూరు, రామన్నపేట, సూర్యాపేట, యాదగిరిగుట్ట, మోత్కూరు, నకిరేకల్ సబ్‌రిజిస్ట్రార్లను ఒకేసారి బదిలీ అయ్యే అవకాశాలు ఉన్నాయి. కొందరు రెండేళ్ల సర్వీస్‌ను పూర్తి చేసుకోగా, మరి కొందరు రెండేళ్ల సర్వీస్ లోపు వారు ఉన్నారు. అయితే ఏ ఒక్కరినీ సాధారణ బదిలీల మార్గదర్శకాల ప్రకారం ఉంచకుండా పూర్తిస్థాయిలో బదిలీలు చేసేందుకు కొత్త జీవోను ప్రభుత్వం తీసుకురానుంది. కొంత మంది సబ్ రిజిస్ట్రార్లు వారికి అనుకూలంగా ఉన్న ప్రాంతంలో పోస్టింగ్ కోసం ప్రయత్నాలు చేసినా, ఈ జీవోతో ఎక్కడికి బదిలీ చేసినా వెళ్లాల్సిన పరిస్థితి ఉండనుంది. రాజకీయ పార్టీల నాయకుల జోక్యం కూడా చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా బదిలీలకు నిర్ణయించింది.

జీరో సర్వీస్ బదిలీలతో ఉత్కంఠ

కొద్ది రోజుల క్రితం వరకు భూముల విలువల పెంపుపై కమిటీల ఏర్పాటు, అధ్యయనం ఆ తరువాత నివేదిక సమర్పణ తిరిగి వాటి తిరస్కరణతో పాటు మళ్లీ అధ్యయనం చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. అయితే తాజాగా, భూ విలువల పెంపుపై సందిగ్ధం నెలకొంది. అసలు ఆగస్టు 1 నుంచి సవరించిన భూముల విలువలు అమలుచేయాల్సి ఉండగా, దీన్ని కొనసాగిస్తారా? నిలిపివేస్తారా? అనేది తేలాల్సి ఉంది. ఈ లోగా భూ విలువల పెంపుపై కీలక భూమిక పోషించే సబ్‌రిజిస్ట్రార్ల బదిలీల ప్రక్రియ వచ్చింది. గత వారం క్రితం సాధారణ బదిలీల కింద సబ్‌రిజిస్ట్రార్లను బదిలీలు చేయాల్సి ఉండగా, ఆ ప్రక్రియ అర్థాంతరంగా నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో జీరో సర్వీస్ బదిలీలపై ఉత్కంఠ నెలకొంది. జీరో సర్వీస్‌కు సంబంధించిన జీవో వస్తే సదరు సబ్‌రిజిస్ట్రార్లు వేరే ప్రాంతాలకు బదిలీ అయ్యే అవకాశాలు ఉన్నాయి. దీంతో చాలా మంది సబ్ రిజిస్ట్రార్లలో ఉత్కంఠ నెలకొంది.

కొత్త జీవో విడుదల కాలేదు

జీరో సర్వీస్‌కు సంబంధించి కొత్తగా ఎలాంటి జీవో ఇంకా విడుదల కాలేదు. సాధారణ బదిలీలు జరిగాయి. సబ్ రిజిస్ట్రార్ల బదిలీలకు సంబంధించి జీరో సర్వీస్ బదిలీల జీవో ఇంకా రాలేదు. సబ్ రిజిస్ట్రార్ల బదిలీలపై ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉంది.

రవి, ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి రిజిస్ట్రార్

చెర్వుగట్టు అభివృద్ధికి ప్రణాళికలు

● కలెక్టర్ నారాయణరెడ్డి ● ఘాట్‌రోడ్డు, డబుల్ రోడ్లకు ప్రతిపాదనలకు ఆదేశం



చెర్వుగట్టుపై సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

నార్కట్‌పల్లి, జూలై 25: భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. భక్తులకు కనీస వసతులు కల్పించే విధంగా ప్రతిపాదనలుండాలని సూచించారు. నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానాన్ని కలెక్టర్ నారాయణరెడ్డి గురువారం సందర్శించారు. ఆలయానికి వచ్చిన కలెక్టర్‌కు తొలుత అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. తొలుత ప్రధానాలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్న కలెక్టర్‌కు వేద పండితులు వేదాశీర్వచనం చేయగా ఎండోమెంట్ ఏసీ మహేంద్రకుమార్, ఈవో సిరికొండ నవీన్‌కుమార్‌లు స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఈవో కార్యాలయంలో అధికారులతో కలిసి దేవస్థానం నిర్వహణపై కలెక్టర్ సుదీర్ఘంగా సమీక్షించారు. రెండో ఘాట్‌రోడ్‌తో పాటు చెర్వుగట్టు దేవస్థానానికి వచ్చేందుకు అన్ని వైపులా ఉన్న రోడ్లను విస్తరించేందుకు ప్రతిపాదనలు రూపొందించాలని ఆర్అండ్‌బీ, పీఆర్ అధికారులను ఆదేశించారు. సిబ్బంది అందరూ బాధ్యతగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నేతకాని కృష్ణయ్య, రేగట్టె నర్సిరెడ్డి, దేవస్థానం మాజీ చైర్మన్‌లు పున్నంరాజు యాదగిరి, రేగట్టె రాజశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు రేగట్టె నవీన్‌రెడ్డి, వారాల రమేశ్, శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసం పెంచాలి

ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసం పెంచేలా, ఉపాధ్యాయులు పనిచేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. నార్కట్‌పల్లి మండలంలోని ఎల్లారెడ్డిగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ వడ్డే భూపాల్‌రెడ్డి, మేడి శ్రీనివాస్, సూర ఆంజనేయులు, డీఆర్‌డీఏ పీడీ నాగిరెడ్డి, డీపీవో మురళి, పీఆర్ ఈఈ భూమన్న, డీఈఈ మహేశ్, ఎంపీడీవో ఉమేశ్‌చారి, ఎంఈవో కూకుట్ల నర్సింహ్మా, ఏఈ పాల మోహన్, ఎంపీవో సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

దామరచర్ల, జూలై 25: నల్లగొండ జిల్లా దామరచర్లలో గురువారం డీసీఎం ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ రవి తెలిపిన వివరాలు ప్రకారం మండలంలోని వీర్లపాలెం గ్రామానికి చెందిన ఎర్రబోయిన కోటయ్య(49) పని నిమిత్తం బైక్‌పై దామరచర్లకు వచ్చాడు. పని ముగించుకుని ఇంటికి వెళ్తూ మండలకేంద్రంలోని నార్కట్‌పల్లి- అద్దంకి రహదారి దాటుతుండగా గుంటూరు నుంచి మిర్యాలగూడ వైపు వెళ్తున్న డీసీఎం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కోటయ్యకు తీవ్రగాయాలయ్యాయి. అతడిని మిర్యాలగూడ ఏరియాఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందాడు. కోటయ్య కుమారుడు హరికృష్ణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

కారు ఢీకొని దుకాణ యజమాని

మునగాల, జూలై 25: సూర్యాపేట జిల్లా మునగాల మండలం తాడ్వాయి వద్ద హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఏఎస్ఐ శ్రీనివాసరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మునగాల మెడికల్ షాపు యజమాని పెరంబుదూరి రామకృష్ణ (58) అలియాస్ రాంబాబు గురువారం ఉదయం బైక్‌పై స్వగ్రామం తాడ్వాయి స్టేజీ వద్దకు పని నిమిత్తం వెళ్లి వస్తున్నాడు. ఈ క్రమంలో రోడ్డు దాటుతుండగా విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్లే కారు ఢీకొట్టటంతో రాంబాబు బైక్ పైనుంచి 10అడుగుల ఎత్తు ఎగిరి రోడ్డు మీద పడిపోయాడు. కొన ఊపిరితో ఉన్న ఆయనను సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందే లోపే మృతి చెందారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. రామకృష్ణ కుమారుడు అమెరికాలో ఉండటంతో మృతదేహాన్ని ఆసుపత్రిలోని ఫ్రీజర్‌లో ఉంచారు. ఆయన భార్య లక్ష్మీశైలజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు. మెడికల్ దుకాణ సొసైటీ అధ్యక్షుడిగా కొనసాగుతున్న రామకృష్ణ మృతికి మెడికల్ దుకాణాలు మూసివేసి చేసి సంతాపం తెలిపారు.


రామకృష్ణ(ఫైల్)

కారు యజమానిపై గోప్యత

ప్రమాదానికి కారణమైన కారును నడుపుతున్న వ్యక్తి ఢిల్లీలో ఉన్నత ఉద్యోగం చేస్తున్నట్లు తెలిసింది. పోలీస్‌లు మాత్రం ఈ విషయాన్ని బయటకి చెప్పటంలేదు. కారును పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి, కేసు ఫైల్ చేశారు. కానీ ఆ అధికారి పేరును గోప్యంగా ఉంచారు.

చౌటుప్పల్ సమీపంలో జార్ఖండ్ వాసి మృతి

చౌటుప్పల్ రూరల్, జూలై 25 : రోడ్డు ప్రమాదంలో జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన వలస కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం వద్ద హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై గురువారం జరిగింది. సీఐ అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన శంకర్ ఓరన్(35) దోతిగూడెం పరిధిలోని ఏజే పరిశ్రమలో పనిచేస్తున్నాడు. గురువారం కొయ్యలగూడెం జాతీయ రహదారిగుండా నడిచివెళ్తుండగా డీసీఎం ఢీకొట్టింది. ఈ ఘటనలో శంకర్ ఓరన్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

వరకట్న వేధింపుల కేసులో

భర్తకు పదేళ్ల జైలు

అత్తామామలు, ఆడపడుచుకు ఏడేళ్లు

హుజూర్‌నగర్, జూలై 25 : వరకట్నం కోసం వేధింపులతో భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తకు పదేళ్ల జైలుతో పాటు అత్తామామ, ఆడపడుచులకు ఏడేళ్ల జైలుశిక్ష పడింది. గురువారం కేసుకు సంబంధించి హుజూర్‌నగర్ అదనపు జిల్లా న్యాయమూర్తి, డాక్టర్ శ్యామ్‌శ్రీ తీర్పునిచ్చారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఖమ్మం జిల్లా బోనకల్లుకు చెందిన ముష్టికుంట్ల గ్రామానికి చెందిన బంధం లక్ష్మారెడ్డి రెండో కుమార్తె శ్రావణిని మేళ్లచెర్వు మండలం కందిబండకు చెందిన కానుగు రవికి ఇచ్చి 2014లో పెళ్లిచేశారు. ఆ సమయంలో ఎకరం వ్యవసాయ భూమి, రూ.10 లక్షల నగదు కట్నం ఇచ్చారు. అనంతరం భర్త రవికుమార్, అతడి తండ్రి వెంకటేశ్వర్లు, తల్లి రాజ్యం, ఆడపడుచు భాగ్యలక్ష్మిలు కలిసి అదనపు కట్నం మరో ఎకరం పొలం, మరో రూ.4 లక్షల తేవాలని శ్రావణిని మానసికంగా, శారీరకంగా వేధించారు. ఈ విషయాన్ని శ్రావణి తల్లిదండ్రులకు చెప్పగా వారు త్వరలో పొలం విక్రయించి డబ్బులు రూ.4 లక్షలు ఇస్తామని అత్తింటి వారికి నచ్చచెప్పారు. అయినా వారు సంతృప్తి చెందకపోవడంతో శ్రావణిని వేధింపులకు గురిచేయడంతో భరించలేక శ్రావణి 2017 ఫిబ్రవరి 18న అత్తగారి ఇంట్లో ఉరేసుకుంది. ఈ ఘటనపై శ్రావణి తల్లిదండ్రులు మేళ్లచెర్వులో పోలీస్‌స్టేషన్‌లో అల్లుడు రవికుమార్, అతడి తల్లిదండ్రులపై ఫిర్యాదుచేశారు. దీంతో ఎస్ఐ రవికుమార్, డీఎస్పీ రమణారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. స్థానికులను విచారించిన అనంతరం నిందితులు ముగ్గురిపై నేరం నిరూపణ కావడంతో శ్రావణ్ భర్త రవికుమార్‌కు పదేళ్లు, అతడి తల్లిదండ్రులు వెంకటేశ్వర్లు, రాజ్యలక్ష్మి, ఆడపడుచు భాగ్యలక్ష్మిలకు ఒక్కొక్కరికి ఏడేళ్ల చొప్పున జైలుశిక్ష విధిస్తూ హుజూర్‌నగర్ రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి శ్యామ్‌శ్రీ గురువారం తీర్పుచెప్పినట్లు పోలీసులు తెలిపారు.

క్రీడాకారుల ఎంపిక 28న

మిర్యాలగూడ టౌన్, జూలై 25: నల్లగొండ, సూర్యాపేట జిల్లాల స్థాయి బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక ఈ నెల 28న నిర్వహిస్తున్నట్లు సంఘ జిల్లా కార్యదర్శి తోట రంగారావు తెలిపారు. అండర్-13 సబ్‌జూనియర్ (బాలబాలికలు) సెలక్షన్స్ నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. పట్టణంలోని క్లియో స్పోర్ట్స్ అకాడమీలో ఆదివారం పోటీలు నిర్వహిస్తామన్నారు.

బడ్జెట్ సమావేశాల్లో జిల్లా ప్రజాప్రతినిధులు


శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంత్రులు భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు


శాసనసభలో బడ్జెట్ ప్రతిని చదువుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మండలిలో బడ్జెట్ ప్రసంగాన్ని వింటున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి


శాసనభలో ఎమ్మెల్యే బాలునాయక్, మండలిలో ఎమ్మెల్సీ కోటిరెడ్డి


శాసనసభలో ఎమ్మెల్యేలు పద్మావతిరెడ్డి, జగదీష్‌రెడ్డి

చింతన

మనిషి జన్మకు పరమార్థం ఏమిటన్నది చిరకాల ప్రశ్న. సమాధానాలు అనేకం ఉన్నా, 'ముక్తి సాధన' అనేది ఏ ఒక్కరూ కాదనలేనిది. దీనికి మరో పేరు 'మోక్ష ప్రాప్తి'. జనన, మరణ బంధం నుంచి విమోచన పొందడం అన్నమాట. అంటే, ఆ చక్రం నుంచే బయటపడటం. ఇది మాటలు, రాతలు కాదు... చేతలతోనే సాధ్యమవుతుంది. దీనికి ఏకైక మార్గం... ప్రతీ వ్యక్తి ఆత్మజ్ఞానం కలిగి ఉండడమే. ఎవరి గురించి వారు తెలుసుకోవాలంటే దైవశక్తినే సాధనంగా భావించాలి. తెలుసుకునే క్రమంలో మన ముందు నాలుగు మార్గాలు కనిపిస్తాయి.. అవన్నీ 'గ'కారంతో మొదలయ్యేవే. అంటే... 'గ'కార చతుష్టయం. అవి: గీత, గంగానది, గాయత్రీ మంత్రం, గోవింద నామం. నిత్యజీవితంలో వీటి స్మరణ మానవ జీవితానికి సార్థకత కలిగిస్తుందని భారతీయ సంస్కృతిని చాటి చెబుతోంది. అదే విషయాన్ని 'ఆత్మ నివేదనం' పేరిట విపులీకరిస్తోంది. 'నివేదన' అంటే 'సమర్పణ' అని అర్థం. మనసును, వాక్కును, కర్మను కేంద్రీకరించడం. ఈ కేంద్రీకరణ ద్వారానే స్వీయ పరిశీలన వేగవంతమవుతుంది.



చతుర్వేదాల సారాంశం

'గ'కార చతుష్టయంలో మొదటిది భగవద్గీత. ఇందులో ఉన్నదంతా వేద విజ్ఞాన సారం. వేదాలు నాలుగు. ఋుగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వ వేదం. 'వేదం' అనేది 'విద్' (తెలియడం) నుంచి ఏర్పడింది.

ఋుగ్వేదం అంటే దేవ వేదమే. ఇందులోని కొన్ని సూక్తాలు పురాణాలను, సామాజిక వర్తనను వివరిస్తాయి. యజుర్వేదం యజ్ఞ నిర్వహణ రీతిని తెలుపుతుంది. మధురతకు సూచిక సామ వేదం. అంతేకాక, సకల జ్ఞాన ప్రదాయని. అథర్వ(ణ) వేదం ఆ ఋుషి పేరు మీదుగా వచ్చింది. ఇందులోనూ శాస్త్రీయ పరిజ్ఞాన వైభవం కనిపిస్తుంటుంది. చతుర్వేదాల సారాంశ సమాహారం కాబట్టే.. భగవద్గీతకు అంతటి ప్రసిద్ధి, విశిష్టత కలిగాయి.

ముక్తి సాధన కోసం... గకార చతుష్టయం

వేదమాత

గాయత్రీదేవి వేదమాతగా ప్రశస్తి అందుకుంది. 'గయలు' అంటే ప్రాణాలు. 'త్రాయతే' అనే పదానికి పరిరక్షణ అని అర్థం. అందుకే ప్రాణ సంరక్షకురాలుగా గాయత్రిని ఆరాధి



స్తారు. గాయత్రీ మంత్రంలోని "ఓం భూర్భువస్సువః తత్సవితుర్వరేణ్యమ్'ను పరిశీలిస్తే... 'ఓం (సర్వ రక్షణ), భూ (ఉనికి), భువ (జ్ఞాన రూపం), స్వ (ఆనంద స్వరూపం), తత్ (అటువంటి లక్షణ సమన్విత పరమేశుడు), సవితు (విశ్వ కర్త) వరేణ్యం (సర్వులతో ఆరాధనీయులు)' అనే భావార్థాలు ఇమిడి ఉన్నాయి. ఇవన్నీ సంప్రదాయ పరంగా, శాస్త్రీయంగా కూడా ప్రామాణికాలు.



అనంత ఫలప్రదం

ఇక గోవింద నామం... 'గకార చతుష్టయంలో దీని పాత్ర అనంతం. 'శ్రీనివాసా, శ్రీవేంకటేశా, నిత్య నిర్మలా, భక్త వత్సలా, దినకర తేజా' అని స్మరణలు చేస్తారు ఆరాధకులు. 'గోవింద' అంటే భూ పరిరక్షకుడు. వేదాల వల్ల ఘనతరుడనే అంతరార్థమూ ఉంది. గోవింద నామం అనంత ఫలప్రదం.

యోగవిద్యకు సంబంధించి సాధన చతుష్టయమనే మాట వినిపిస్తూ ఉంటుంది. వివేకంతో వ్యవహరించడం, యథాతథ స్థితిని గ్రహించగలగడం, సంపత్ లేదా సమతుల్యతను కోరుకోవడం, ఆత్మ జ్ఞాన ప్రాప్తికి పలు విధాలుగా ప్రయత్నించడం. ఇదంతా అభ్యాస సాధనాల క్రమం. వీటన్నిటి ఫలితంగా స్వయం పరిశీలన శక్తి విస్తారమవుతుంది. క్రమేణా ముక్తి ప్రాప్తికి మార్గం సులభతరంగా మారుతుంది.

మానసిక, నైతిక పరమోన్నత స్థితే ముక్తి. అంటే... వ్యక్తి తన సహజత్వాన్ని పొందగలగడం. దీనికి మూలాధారం ఆత్మ నివేదన. దైవం పట్ల పరిపూర్ణ ప్రేమను వ్యక్తపరచే రీతి. భక్తి మార్గాలు ఎన్నో ఉంటాయి. వాటన్నిటికన్నా నివేదన విధానమే భగవంతుడిని, భక్తుడిని అనుసంధానిస్తుంది. పత్రం, పుష్పం, ఫలం, చివరికి నీటినైనా భక్తితో సమర్పిస్తే ప్రీతిగా స్వీకరిస్తానన్నది గీతాచార్యుడి మాట. నిజానికి మనిషి శరీరం ఆకు వంటిదే. రాలిపోతుందే తప్ప, శాశ్వతం కాదు. అందువల్ల పత్ర అర్చనకు ఆ వ్యక్తి సంసిద్ధం కావాలి. తన మనోవనంలోని మొగ్గను పుష్పంలా వికసింప చేయాలి. ఆ వికసిత పుష్పమే విజ్ఞాన ఫలంగా రూపాంతరం చెందడాన్ని సమర్పణగా వర్ణిస్తుంది మన భారతీయ ధార్మిక చింతన. పవిత్ర గీత, పావన గంగ, శక్తిదాయక గాయత్రి, స్ఫూర్తిప్రదాయ గోవింద స్మరణలకు మనను మనం సమర్పించుకుంటేనే జీవితాలకు ధన్యత. వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు, భక్తి జ్ఞాన కర్మ యోగాదులు చాటి చెబుతున్నది ఇటువంటి ఆత్మ సమర్పణ పద్ధతినే.

• జంధ్యాల శరత్‌బాబు
99483 45013

భువనపావని...

యమున, కృష్ణా, గోదావరి, కావేరి, సింధు, నర్మదలతో పాటు సప్త నదుల్లో ఒకటి గంగ. 'భువన పావని', 'అనంత వాహిని' అనేవి దాని నామాంతరాలు. మన సంస్కృతి, చరిత్ర, వ్యవస్థ అంతా గంగానదితో మమేకమై ఉంది. గంగమ్మ తల్లిగా, గంగా భవానీగా పిలిచేది అందుకే. గంగను నీటికి పర్యాయపదంగా మనం ఉపయోగిస్తాం.. గంగ మరెన్నో నదులతో కలసి మహా ప్రవాహంగా మారుతుంది. ఆ జల స్నానం భారతీయులకు పరమ పవిత్రం. గంగా, యమున, సరస్వతీ నదుల సంగమ స్థలాన (త్రివేణి) కుంభ మేళాలు ఏర్పాటవుతుంటాయి. అలహాబాద్ (ప్రయాగ)లో ఈ మహోత్సవం వచ్చే ఏడాది జనవరిలో మొదలవుతుంది. ఇంతటి మేటి విశిష్టత కారణంగా... గంగ విశ్వ విఖ్యాతి పొందింది.

సద్బోధ

యోగి- సాధువు

పూర్వం ఒక యోగి అకుంఠితమైన తపస్సు చేసి, కొన్ని గొప్ప శక్తులను సంపాదించాడు. అతను స్వతహాగా మంచి వాడు. కానీ తన శక్తులంటే అతనికి గర్వం ఉండేది. వాటిని ప్రదర్శించాలనే కోరిక ఉండేది. ఆ గర్వాన్ని తగ్గించాలని దేవుడు అనుకున్నాడు. ఒక రోజు... సాధువు రూపంలో ఆ యోగి దగ్గరకు వచ్చాడు. "స్వామీ! మీకు అద్భుతమైన శక్తులు ఉన్నాయని విన్నాను. మిమ్మల్ని దర్శించుకోవాలని వచ్చాను" అని అన్నాడు. మాటలు విన్న యోగి ఉప్పొంగిపోయాడు. మునిని సాదరంగా ఆహ్వానించి, ఆతిథ్యం ఇచ్చాడు.

ఈలోగా అటువైపు ఒక ఏనుగు వెళుతోంది. సాధువు దాన్ని చూపిస్తూ "స్వామీ! మీరు కోరుకుంటే ఆ ఏనుగును చంపగలరా?" అని అడిగాడు.

."ఎందుకు చంపలేను? ఇదిగో చూడండి" అంటూ నేల మీద పిడికెడు మట్టి తీసుకున్నాడు యోగి. దాన్ని మంత్రించి ఏనుగు మీదకు విసిరాడు. ఆ ఏనుగు నొప్పితో విలవిలలాడుతూ నేల మీద పడి మరణించింది.

'చూశావా!' అన్నట్టు గర్వంగా తలాడించాడు యోగి.


"మీ శక్తులు అమోఘం స్వామీ! మీరు ఏనుగును చంపేశారు. మరి దాన్ని మళ్ళీ బతికించగలరా?" అని అడిగాడు సాధువు.

"తప్పకుండా" అంటూ మరికాస్త మట్టి తీసుకొని, మంత్రించి, మరణించిన ఏనుగు మీద చల్లాడు యోగి. ఆ ఏనుగు లేచి నిలబడింది. శరీరానికి అంటుకున్న దుమ్మును విదిలించుకుంటూ అడవిలోకి నడిచింది.

"స్వామీ! మీకు అపారమైన శక్తులు ఉన్నాయి. కానీ నాకొక సందేహం ఉంది తీరుస్తారా?" అన్నాడు సాధువు.

"దానికేం? అడగండి" అన్నాడు యోగి.

"మీరు ఏనుగును చంపారు. దాన్ని మళ్ళీ బతికించారు. కానీ అందువల్ల మీకు కలిగిన ప్రయోజనం ఏమిటి? ఆధ్యాత్మికమైన ఉన్నతి కలిగిందా? మోక్షాన్ని, భగవంతుణ్ణి చేరే మార్గం దొరికిందా?" అని ప్రశ్నించాడు సాధువు.



ఆ మాటలకు యోగి దిగ్భ్రాంతి చెందాడు. సాధువు రూపంలో ఉన్న దేవుడు చిరునవ్వు నవ్వుతూ మాయమైపోయాడు. ఇంతసేపూ తన ముందు ఉన్నది సాక్షాత్తూ భగవంతుడేనని యోగికి అర్థమయింది. ఆ క్షణం నుంచి అతనిలో గర్వం, కోరికలు పూర్తిగా నశించిపోయాయి.


శ్రీ రామకృష్ణ పరమహంస తన శిష్యులకు ఈ కథ చెబుతూ "సూది బెజ్జానికి అడ్డుగా కంటికి కనిపించని చిన్న నలుసు ఉన్నా సరే... దానిలోంచీ దారం వెళ్ళడం కష్టమవుతుంది. అదే విధంగా సాధకుల్లో ఇసుకరేణువంత కోరిక, గర్వం మిగిలి ఉన్నా... పరమాత్మ తత్త్వాన్ని గ్రహించలేరు. మోక్షపథాన్ని అందుకోలేరు" అని స్పష్టం చేశారు.

'దిక్సూచి' వెబ్ పేజీలో...
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/MNuqIkIలో చదవండి.

సుభాషితం

సజ్జన లక్షణాలు

ప్రదానం ప్రచ్ఛన్నం గృహ ముపగతే సంభ్రమవిధిః
ప్రియంకృత్వా మౌనం సదసి కథనం చాప్యుపకృతేః
అనుత్సేకో లక్ష్మ్యాం నిరభిభవసారాః పరకథాః
సతాం కేనోద్దిష్టం విషమ మసిధారావ్రత మిదమ్



సజ్జనుల్లో సహజంగా ఉండే లక్షణాల గురించి 'నీతి శతకం'లో భర్తృహరి వివరించిన శ్లోకం ఇది. దీన్ని...

పొసగన్ దానము గుప్త మర్థి భవనంబు జేరుచో సంభ్రమో
ల్లసదుత్థానవిధానముం బ్రియవిధుల్ గావించి మౌనంబు రా
జసభన్ మిత్రకృత ప్రకాశనము గుత్సాకర్మ వైముఖ్య మీ
యసిధారావ్రతచర్య యెవ్వడు మహార్యశ్రేణికిం

దెల్పెనో... అంటూ ఏనుగు లక్ష్మణకవి సముచిత రీతిలో తెలుగువారికి సమర్పించాడు.

భావం: దానాలు చేస్తున్నానని చాటింపు వేసుకోకుండా రహస్యంగా చేయడం. ఇంటికి వచ్చి యాచించిన వారిని ఆదరించడం. వేరొకరికి తను చేసిన మేలు గురించి ప్రచారం చేసుకోకపోవడం, వేరొకరు తనకు చేసిన మేలును పదిమందికీ చెప్పడం, ఎన్ని సంపదలు వచ్చినా వినయంగా ఉండడం, పరుల గురించి చెడ్డగా మాట్లాడకపోవడం... వీటన్నిటినీ పాటించడం కత్తిమీద సాములాంటిది. ఈ గుణాలు ఎవరో బోధిస్తేనో, నేర్పితేనో రావు. సజ్జనుల్లో ఈ లక్షణాలు స్వతస్సిద్ధంగా ఉంటాయి.

బిజినెస్

టెక్ మహీంద్రా లాభంలో 23% వృద్ధి

క్యూ1లో రూ.851 కోట్లుగా నమోదు.. రూ.13,005 కోట్లకు తగ్గిన ఆదాయం



ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికానికి (క్యూ) టెక్ మహీంద్రా రూ.851 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఇదే కాలానికి గడించిన రూ.692.5 కోట్ల లాభంతో పోలిస్తే, ఈసారి 23 శాతం వృద్ధి నమోదైంది. కాగా, ఈ క్యూ1లో కంపెనీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 1.2 శాతం తగ్గి రూ.13,005 కోట్లకు పరిమితమైంది. ఆదాయం తగ్గినప్పటికీ, మొత్తం వ్యయాలు 2.3 శాతం తగ్గి రూ.955 కోట్లకు పరిమితం కావడం, వడ్డీ ఖర్చులు 40 శాతం తగ్గి రూ.715 కోట్లకు దిగిరావడం లాభాల్లో మెరుగైన వృద్ధికి దోహదపడింది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2024-25 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ మరింత మెరుగైన పనితీరు కనబర్చనుందని టెక్ మహీంద్రా కొత్త ఎండీ, సీఈఓ మోహిత్ జోషి అన్నారు.

- సేవల వ్యయం తగ్గడంతో క్యూ1లో కంపెనీ నిర్వహణ లాభాల మార్జిన్ మరో 1.9 శాతం పెరిగి 12 శాతంగా నమోదైంది. ఇకపై లాభాల మార్జిన్ క్రమంగా పుంజుకోనుందని మోహిత్ జోషి అన్నారు.
- గడిచిన మూడు నెలల్లో కంపెనీ 53.4 కోట్ల డాలర్ల విలువైన కొత్త డీల్స్‌ను కుదుర్చుకుంది. అయితే, ఐటీ రంగం ఇంకా అనిశ్చితిలోనే కొనసాగుతోందని, ఈ మధ్యనే చేపట్టిన పునర్‌వ్యవస్థీకరణ ప్రణాళిక కంపెనీకి దోహదపడుతోందని జోషి పేర్కొన్నారు.

6,000 మంది ఫ్రెషర్ల నియామకాలు

గత మూడు నెలల్లో టెక్ మహీంద్రా ఉద్యోగులు నికరంగా 2,165 మంది పెరిగారు. దాదాపు 1,000 మంది ఫ్రెషర్ల నియామకాలతో పాటు బీపీఓ విభాగంలో మరింత మందిని చేరుకున్నట్లు కంపెనీ వర్గాలు తెలిపాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రాంగణ నియామకాల ద్వారా 6,000 మంది ఫ్రెషర్లను చేర్చుకోవాలనుకుంటున్నట్లు కంపెనీ ఇదివరకే ప్రకటించింది.

ద్వితీయార్ధంలో సిబ్బందికి వేతన పెంపు

తమ కంపెనీలో పనిచేస్తున్న 1.47 లక్షలకు పైగా ఉద్యోగులకు వేతనాన్ని పెంచాలనుకుంటున్నట్లు జోషీ వెల్లడించారు. ఈ ఆర్థిక సంవత్సరం ద్వితీయార్ధంలో (2024 అక్టోబరు-2025 మార్చి) పెంపు ఉంటుందని, ఇదే విషయాన్ని సిబ్బందికి తెలియజేయడం జరిగిందన్నారు. ఐటీ రంగ కంపెనీలకు ఉద్యోగుల జీతాలే ప్రధాన వ్యయం.

పసిడి పడుతోంది..

న్యూఢిల్లీ: పసిడి, వెండి ధరలు వరుసగా మూడో రోజూ తగ్గుముఖం పట్టాయి.ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్లు) బంగారం ధర గురువారం మరో రూ.1,000 తగ్గి రూ.70,650 స్థాయికి జారుకుంది. కిలో వెండి ఏకంగా రూ.3,500 తగ్గడంతో ధర రూ.84,000కు దిగివచ్చింది. అంతర్జాతీయంగా వీటి ధరలు గణనీయంగా తగ్గడంతో పాటు దేశీయ బులియన్ మార్కెట్లోనూ జువెలర్లు భారీగా అమ్మకాలకు పాల్పడటం ఇందుకు కారణమైంది. గడిచిన మూడు రోజుల్లో తులం బంగారం రూ.5,000 తగ్గింది. ఈ విలువైన లోహాలపై కస్టమ్స్ సుంకాన్ని 6 శాతానికి తగ్గిస్తున్నట్లు బడ్జెట్‌లో ప్రకటించడంతో ఈనెల 23న గోల్డ్ రేటు ఏకంగా రూ.3,350 పడిపోయి రూ.72,300 స్థాయికి జారుకుంది. ఈ ఏడాదిలో అదే అతిపెద్ద తగ్గుదల. ఇంటర్నేషనల్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం ధర ఒక దశలో 42.20 డాలర్లు తగ్గి 2,421 డాలర్ల స్థాయిలో ట్రేడవగా.. సిల్వర్ 28 డాలర్ల స్థాయికి పడిపోయింది.

సైయెంట్ లాభంలో 17 శాతం క్షీణత

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో సైయెంట్ రూ.1,414 కోట్ల రెవెన్యూపై రూ.141 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చితే ఆదాయం 2.8 శాతం, లాభం 17 శాతం క్షీణించాయి. కరెన్సీ మారకం ప్రభావం జూన్ త్రైమాసిక ఫలితాలపై పడిందని, దీంతో డిజిటల్, ఇంజనీరింగ్, టెక్నాలజీ (డీఈటీ) వ్యాపారం క్షీణించిందని కంపెనీ పేర్కొంది. జూన్ త్రైమాసికంలో 5.24 కోట్ల డాలర్ల విలువైన ఆర్డర్లను కంపెనీ చేజిక్కించుకుంది. ఈ ఆర్డర్ల కారణంగా రానున్న త్రైమాసికాల్లో నిలకడైన వృద్ధిని కనబరచవచ్చని భావిస్తున్నట్లు సైయెంట్ తెలిపింది. సమీక్షా త్రైమాసికంలో సెమీకండక్టర్ విభాగంలోకి కంపెనీ అడుగుపెట్టిందని, ఇందుకోసం ప్రత్యేకంగా అనుబంధ సంస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపింది.

48 శాతం తగ్గిన లారస్ ల్యాబ్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికానికి గాను లారస్ ల్యాబ్స్ లిమిటెడ్ రూ.1,195 కోట్ల రెవెన్యూపై రూ.13 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంతో పోల్చితే ఆదాయం 1 శాతం, లాభం 48 శాతం తగ్గింది. సమీక్షా త్రైమాసికంలో కీలకమైన సీడీఎంఓ క్లినికల్ ప్రాజెక్టుల్లో నిలకడైన పనితీరుతో పాటు అంకాలజీ ఏపీఐ, ఏఆర్‌వీ విభాగంలో పటిష్ఠమైన వృద్ధిని కనబరచటం కలిసివచ్చిందని లారస్ ల్యాబ్స్ సీఈఓ సత్యనారాయణ చావా తెలిపారు. ఈ కాలంలో కంపెనీ సీడీఎంఓ-సింథసిస్ వ్యాపారం రూ.214 కోట్లుగా ఉండగా ఏపీఐ రెవెన్యూ రూ.664 కోట్లుగా ఉంది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	69,820 ▼	64,000 ▼	89,000 ▼
ముంబై	68,227 ▼	62,496 ▼	81,474 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



26వ తేదీ			
హైదరాబాద్	460	విజయవాడ	480
వరంగల్	462	గోదావరి	475
చిత్తూరు	573	విశాఖపట్నం	485
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	104	విజయవాడ	104
వరంగల్	104	గుంటూరు	107
కరీంనగర్	104	ఒంగోలు	107
మహబూబ్‌నగర్	104	చిత్తూరు	120
కర్నూలు	104	నెల్లూరు	120
విశాఖపట్నం	93	అనంతపురం	104
గోదావరి	104		

మ్యాన్‌కైండ్ గూటికి బీఎస్‌వీ

- ఒప్పందం విలువ రూ.13,630 కోట్లు
- అడ్వెంట్ ఇంటర్నేషనల్ నుంచి కొనుగోలు



న్యూఢిల్లీ: భారత్ సీరమ్స్ అండ్ వ్యాక్సిన్స్ (బీఎస్‌వీ)లో 100 శాతం వాటాను రూ.13,630 కోట్లకు కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు మ్యాన్‌కైండ్ ఫార్మా గురువారం ప్రకటించింది. అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ సంస్థ అడ్వెంట్ ఇంటర్నేషనల్ నుంచి ఈ కంపెనీని చేజిక్కించుకుంది. బీఎస్‌వీ కోసం ఈక్యూటీ, అబుదాబీ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ (ఏడీఐఏ) కన్సార్టియం కూడా పోటీ పడినప్పటికీ అధిక ధరకు బిడ్డింగ్ వేయడం ద్వారా మ్యాన్‌కైండ్ ఈ సంస్థను హస్తగతం చేసుకుంది. బీఎస్‌వీ కొనుగోలు మ్యాన్‌కైండ్ వ్యాపారాన్ని మరింత ఎత్తుకు తీసుకెళ్లనుంది. మహిళల ఆరోగ్యం, సంతాన సాఫల్య ఔషధాల మార్కెట్లో అగ్రగామిగా నిలపనుంది. అలాగే, క్రిటికల్ కేర్‌లో ఇతర ఉత్పత్తుల్లోకీ ప్రవేశం కల్పించనుంది. బయోఫార్మాస్యూటికల్స్‌లో ఐదు దశాబ్దాలకు పైగా అనుభవం కలిగిన బీఎస్‌వీ.. మహిళ ఆరోగ్యానికి సంబంధించి సంతాన సాఫల్యం నుంచి ప్రసవం తర్వాత సంరక్షణలో ఉపయోగించే పలు సంక్లిష్ట ఉత్పత్తులను మార్కెట్లో విక్రయిస్తోంది. "మ్యాన్‌కైండ్ ప్రయాణంలో బీఎస్‌వీ కొనుగోలు కీలక మైలురాయి. మహిళల ఆరోగ్యం, ఫెర్టిలిటీ మార్కెట్లో తమను అగ్రసంస్థగా నిలబెడుతుంది. భవిష్యత్‌లో ఈ విభాగం అపార అవకాశాలు అందించడంతో పాటు ప్రపంచవ్యాప్తంగా బలమైన వ్యాపార వృద్ధికి బాటలు వేయనుందని భావిస్తున్నా"మని మ్యాన్‌కైండ్ ఫార్మా వైస్ ఛైర్మన్, ఎండీ రాజీవ్ జునేజా అన్నారు.

పిట్టీ ఇంజనీరింగ్ చేతికి దక్షిణ్ ఫౌండ్రీ

డీల్ విలువ రూ.153 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దక్షిణ్ ఫౌండ్రీ ప్రైవేట్ లిమిటెడ్ (డీఎఫ్‌పీఎల్)లో 100 శాతం వాటాలను రూ.153.12 కోట్లకు కొనుగోలు చేసినట్లు పిట్టీ ఇంజనీరింగ్ లిమిటెడ్ వెల్లడించింది. డీఎఫ్‌పీఎల్‌తో ఒప్పందం కుదుర్చుకున్న పదిహేను రోజుల్లో ఈ డీల్‌ను పూర్తి చేయనున్నట్లు పేర్కొంది. జూన్ త్రైమాసికం ముగిసే నాటికి డీఎఫ్‌పీఎల్ వద్ద రూ.42.71 కోట్ల నగదు, బ్యాంక్ బ్యాలెన్స్ ఉంది. డక్టైల్ ఐరన్, గ్రే ఐరన్, లో కార్బన్ అల్లాయ్ స్టీల్ గ్రేడ్స్, సిమో ఐరన్ కాస్టింగ్స్ తయారీలో డీఎఫ్‌పీఎల్ కీలకంగా ఉంది. బెంగళూరు, హోస్కోట్‌లో ఏటా 4,200 టన్నుల స్థాపిత సామర్థ్యం కలిగిన రెండు ప్లాంట్లను నిర్వహిస్తోంది. డీఎఫ్‌పీఎల్ కొనుగోలుతో పిట్టీ ఇంజనీరింగ్ ఉత్పత్తి సామర్థ్యపరంగా మరింత బలోపేతం కానుందని సంస్థ ఎండీ అక్షయ్ ఎస్ పిట్టీ తెలిపారు.

స్థిరాస్తుల అమ్మకాల లాభాలపై కొత్త కొర్రీ

- వడ్డీ, స్టాంప్ డ్యూటీలు ఖర్చులు యథాతథం

న్యూఢిల్లీ: స్థిరాస్తుల అమ్మకాలపై దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను (ఎల్‌టీసీజీటీ) తగ్గించామని చెబుతూనే.. ప్రభుత్వం పెద్ద బాంబు పేల్చింది. ఈ లాభాల లెక్కింపు కోసం ఆస్తుల కనీస విలువను లెక్కించేటప్పుడు, వాటిని కొనేటప్పుడు చెల్లించే స్టాంప్ డ్యూటీ, అప్పు చేసి కొంటే.. ఆ అప్పులపై చెల్లించే వడ్డీల భారం.. ప్రస్తుతం ఉన్న విధంగానే లెక్కింపులోకి రాదని స్పష్టం చేసింది. కేంద్ర రెవెన్యూ కార్యదర్శి సంజయ్ మల్హోత్రా గురువారం ఈ విషయం వెల్లడించారు. కొత్త ఎల్‌టీసీజీటీ విధానంలోనూ ఇదే పద్ధతి కొనసాగుతుందన్నారు. దీంతో ద్రవ్యోల్బణం ఆధారంగా లెక్కించే ఇండెక్సేషన్ ఖర్చుల ప్రయోజనం రద్దయి, స్థిరాస్తుల దీర్ఘకాలిక మూలధన లాభాలపై పన్ను భారం 20 శాతం నుంచి 12.5 శాతానికి తగ్గినా అమ్మకందారులకు పెద్దగా ప్రయోజనం లేదని భావిస్తున్నారు.

మెటల్, బ్యాంకింగ్ షేర్లు పడేశాయ్..

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వరుసగా ఐదో రోజూ నష్టాలు చవిచూశాయి. గురువారం ట్రేడింగ్ ఆరంభంలోనే 671 పాయింట్ల వరకు క్షీణించి 79,500 దిగువ స్థాయికి జారుకున్న సెన్సెక్స్.. మళ్లీ క్రమంగా తేరుకుని చివరికి 109.08 పాయింట్ల నష్టంతో 80,039.80 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం ఇంట్రాడేలో 203 పాయింట్ల మేర పతనమై 24,200 స్థాయికి జారుకుంది. చివర్లో 7.40 పాయింట్ల నష్టంతో 24,406.10 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్ ట్రెండ్ బలహీనంగా ఉండటంతో ఇన్వెస్టర్లు లోహం, బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగాల షేర్లలో అమ్మకాలకు పాల్పడటం ఇందుకు కారణమైంది. మూలధన లాభాలపై పన్ను పెంచడంతో విదేశీ ఇన్వెస్టర్లు మన ఈక్విటీల నుంచి పెట్టుబడులు ఉపసంహరించుకోవడం కూడా మార్కెట్‌పై ఒత్తిడి పెంచింది.

30 నుంచి అకుమ్స్ డ్రగ్స్ ఐపీఓ: అకుమ్స్ డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) ఈ నెల 30న ప్రారంభమై ఆగస్టు 1న ముగియనుంది. ఐపీఓలో విక్రయించనున్న షేర్ల బిడ్డింగ్ ధర శ్రేణిని కంపెనీ రూ.646-679గా నిర్ణయించింది. తద్వారా రూ.1,857 కోట్ల వరకు సమీకరించాలనుకుంటోంది.

ఐపీఓకి స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ

హైదరాబాద్ కేంద్రంగా ఉన్న స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకి వస్తోంది. ఈ మేరకు మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు సమర్పించింది. ఈ ఇష్యూ ద్వారా కంపెనీ రూ.600 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో రూ.250 కోట్ల మొత్తానికి కొత్తగా రూ.10 ముఖ విలువతో కూడిన ఈక్విటీ షేర్లు జారీ చేయటం ద్వారా సమీకరించనుంది. మిగిలిన రూ.350 కోట్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్‌ఎస్) ద్వారా సమీకరించనుంది. ఓఎఫ్‌ఎస్ ద్వారా 1.844 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించనుంది. ఫార్మాస్యూటికల్, కెమికల్ రంగాలకు అవసరమైన స్పెషలైజ్డ్ ఇంజనీరింగ్ పరికరాల తయారీలో కంపెనీ కీలకంగా ఉంది.

కెనరా బ్యాంక్ లాభం రూ.3,905 కోట్లు



బెంగళూరు (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగంలోని కెనరా బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్ ముగిసిన త్రైమాసికంలో రూ.3,905 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన రూ.3,535 కోట్లతో పోల్చితే లాభం 10 శాతం పెరిగింది. మొండి బకాయిలు తగ్గడం ఇందుకు దోహదపడింది. కాగా బ్యాంక్ త్రైమాసికాదాయం రూ.29,823 కోట్ల నుంచి రూ.34,020 కోట్లకు పెరిగింది. వడ్డీల ద్వారా జూన్ త్రైమాసికంలో రూ.28,701 కోట్లు ఆదాయం లభించింది. నికర వడ్డీ ఆదాయం 6 శాతం వృద్ధితో రూ.8,666 కోట్ల నుంచి రూ.9,166 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్ మాత్రం 3.05 శాతం నుంచి 2.90 శాతానికి తగ్గింది. భవిష్యత్తులో ఎన్ఐఎం మెరుగుపడి 2.95 శాతం వద్ద స్థిరపడుతుందని భావిస్తున్నట్టు బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ కె.సత్యనారాయణ రాజు చెప్పారు. ఆస్తుల నాణ్యత విషయానికి వస్తే బ్యాంక్ స్థూల మొండి బకాయిలు (ఎన్‌పీఏ) గత ఏడాది ఇదే త్రైమాసికంతో పోల్చితే 5.15 శాతం నుంచి 4.14 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పీఏలు కూడా 1.57 శాతం నుంచి 1.24 శాతానికి తగ్గాయి. ఎన్‌పీఏలకు కేటాయింపులు రూ.2,418 కోట్ల నుంచి రూ.2,171 కోట్లకు తగ్గాయి. బ్యాంక్ సీఆర్ఏఆర్ (క్యాపిటల్ అడిక్వసీ నిష్పత్తి) 16.28 శాతానికి పెరిగింది. ప్రొవిజన్ కవరేజి నిష్పత్తి (పీసీఆర్) 118 బేసిస్ పాయింట్లు పెరిగి 89.22 శాతానికి చేరింది. ఈ ఏడాది చివరికి పీసీఆర్ 90 శాతం దాటాలని బ్యాంక్ భావిస్తున్నదని రాజు చెప్పారు. ప్రతి త్రైమాసికంలోనూ రూ.1,000 కోట్లు మొండి బకాయిలు వసూలు చేయాలన్నది తమ లక్ష్యమన్నారు.

రూ.8,500 కోట్ల సమీకరణ

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.8,500 కోట్ల నిధులు సమీకరించేందుకు బ్యాంక్ డైరెక్టర్ల బోర్డు అనుమతించిందని ఎండీ తెలిపారు. టియర్ 1, టియర్ 2 బాండ్ల ద్వారా ఈ నిధులు సమీకరిస్తామన్నారు. అలాగే తమ అనుబంధ సంస్థలు కెనరా హెచ్‌ఎస్‌బీసీ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ, కెనరా రొబెకో ఏఎంసీ రెండింటిలోనూ 25 శాతం వంతున వాటాలు విక్రయించాలని నిర్ణయించినట్టు రాజు వెల్లడించారు.

రోడ్డు విస్తరణ పనులు త్వరలో పూర్తి చేస్తాం

● ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి


రోడ్డు మరమ్మతులు చేయిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

వేములపల్లి, జూలై 25: కొంతకాలంగా అసంపూర్తిగా ఉన్న బీమారం - సూర్యాపేట రహదారి పనులను త్వరలోనే పూర్తి చేయిస్తానని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని సల్కునూరు క్రాస్‌రోడ్డు సమీపంలో కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు భారీగా దెబ్బతిన్న బీమారం - సూర్యాపేట రహదారిని గురువారం ఆయన స్వయంగా మరమ్మతు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా రోడ్డు విస్తరణ పనులు దశాబ్దకాలంగా పూర్తి చేయకపోవడం బాధాకరమన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో రహదారి విస్తరణకు అవసరమైన నిధులు కేటాయించేలా కృషి చేసి అసంపూర్తి పనులను పూర్తి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తమ్మడబోయిన అర్జున్, బీరెల్లి సతీష్‌రెడ్డి, సందీప్, సైదులు పాల్గొన్నారు.

అప్రమత్తతతో ప్రమాదాల నివారణ : ఎంవీఐ



సమావేశంలో మాట్లాడుతున్న వీరస్వామి

మిర్యాలగూడ టౌన్, జూలై 25: అప్రమత్తతతో ప్రమాదాల నివారణ సాధ్యమని మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) లాల్‌కోట వీరస్వామి అన్నారు. ఆర్టీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రమాదరహిత వారోత్సవాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, విధి నిర్వహణలో సెల్‌ఫోన్ వినియోగించరాదన్నారు. డిపో మేనేజర్ రామ్మోహనరెడ్డి మాట్లాడుతూ సంస్థలో డ్రైవర్ల పాత్ర కీలకమని, ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు. పలు అంశాలపై డ్రైవర్లకు, మెకానిక్‌లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్టీసీ సీఐ భారతీ భాయి తదితరులు పాల్గొన్నారు.

'బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా రాష్ట్ర బడ్జెట్'


కళ్లకు గంతలతో నిరసన తెలుపుతున్న నాయకులు

నల్లగొండ టౌన్, జూలై 25: ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని, బడ్జెట్ పూర్తిగా బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉందని బీసీ యువజన సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టెకోలు దీపేందర్ అన్నారు. బడ్జెట్ కేటాయింపులో జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ బీసీ యువజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట కళ్లకు నల్లగంతలు కట్టుకుని నిరసన ప్రదర్శన వ్యక్తం చేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో 65 శాతానికి పైగా ఉన్న బీసీలకు కేవలం 9200 కోట్లు కేటాయించి బీసీల గొంతుకోసి తీరని అన్యాయం చేశారన్నారు. కార్యక్రమంలో బీసీ యువజన సంఘం జిల్లా కార్యదర్శి ఎలిజాల వెంకటేశ్వర్లు, నియోజకవర్గ అధ్యక్షుడు బోళ్ల నాగరాజు, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు వనం వెంకటేశ్వర్లు, బీసీ యువజన సంఘం నాయకులు ఎలిజాల రమేష్, బట్టు శ్రీశైలం, రవీందర్, విజయ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

టీఎన్జీవోస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడి విజయకృష్ణ


విజయకృష్ణ

నల్లగొండ టౌన్, జూలై 25: తెలంగాణ నాన్‌గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా కోఆపరేటివ్ శాఖకు చెందిన సీనియర్ ఇన్స్‌పెక్టర్ వంగూరు విజయకృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు సెంట్రల్ యూనియన్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో సెంట్రల్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు మారం జగదీశ్వర్, సీఎస్ఎం ముజీబ్‌లు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా విజయకృష్ణ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఇచ్చిన బాధ్యతను అందరి సహకారంతో సక్రమంగా నిర్వహిస్తానన్నారు.

నేడు మినీ జాబ్‌మేళా

నల్లగొండ టౌన్, జూలై 25: జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు పలు ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలను కల్పించడానికి శుక్రవారం నల్లగొండలోని ఐటీఐ క్యాంపస్‌లో మినీ జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధికల్పన అధికారి ఎస్.మాధవరెడ్డి తెలిపారు. ఈ జాబ్‌మేళాకు ప్రముఖ నాలుగు ప్రైవేటు కంపెనీలు హాజరుకానున్నట్లు తెలిపారు. నిరుద్యోగ యువతీయువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 7893420435, 8185874530 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ఆడపిల్లలపై అకృత్యాల నియంత్రణే షీ టీం లక్ష్యం

హాలియా, జూలై 25: ఒంటరి మహిళలు, యువతులు, విద్యార్థినులు, వివిధ రంగాల్లో పనిచేస్తున్న మహిళలపై సమాజంలో జరుగుతున్న అకృత్యాలపై అవగాహన కల్పించి వాటిని నియంత్రించడమే షీ టీం లక్ష్యమని మిర్యాలగూడ షీ టీం ఎస్ఐ కోటేష్ అన్నారు. గురువారం హాలియాలోని నిర్మల పాఠశాలలో షీ టీం కార్యక్రమాలపై ఏఎస్ఐలు షరీఫ్, ప్రభాకర్‌లు అవగాహన కల్పించారు. సమాజంలో ఆడపిల్లలు ఆపదలో అత్యవసర పరిస్థితుల్లో 100 నెంబర్‌కు డయల్ చేయాలని అన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇష్టంతో కష్టపడితే విజయం సాధ్యం

● అమెరికా క్రికెట్ బోర్డు చైర్మన్ పీసీకే వేణుగోపాల్‌రెడ్డి


వేణుగోపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్థులు

తిరుమలగిరి(సాగర్), జూలై 25: ఇష్టంతో కష్టపడితే విజయం సాధ్యమవుతుందని అమెరికా క్రికెట్ బోర్డు చైర్మన్ పీసీకే వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని అల్వాలకు చెందిన వెటర్నరీ డాక్టర్ పీసీకే కొండల్‌రెడ్డి లక్ష్మమ్మల కుమారుడైన వేణుగోపాల్‌రెడ్డి ప్రస్తుతం జార్జియా రాష్ట్రంలో స్థిరపడ్డారు. ఉన్నత చదువులు, ఉద్యోగ రీత్యా అమెరికాకు వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. గురువారం స్వగ్రామానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్థులు, బంధువులతో మాట్లాడారు. ఉన్నత చదువుల కోసం అమెరికాకు వెళ్లి అక్కడే సాఫ్ట్‌వేర్ కంపెనీని నెలకొల్పారు. తనకు ఇష్టమైన క్రికెట్‌ను అమెరికాలో అభివృద్ధి చేసేందుకు ఆయన ఎంతో కృషి చేశారు. 2007లో అట్లాంట క్రికెట్ లీగ్‌ను ప్రారంభించి ఆ లీగ్‌లో అమెరికాలోని వివిధ రాష్ట్రాల జట్లు పాల్గొనేలా ప్రోత్సహించారు. అదేవిధంగా అట్లాంట క్రికెట్ అకాడమీని స్థాపించి క్రికెట్‌పై ఆసక్తి ఉన్న ఉత్సాహవంతులైన యువకులకు క్రికెట్ మెళకువలను నేర్పించేందుకు కృషి చేస్తున్నారు. ఈ క్రమంలో 2018లో ఏర్పడిన అమెరికా క్రికెట్ సంఘానికి మొదటి ఎన్నికల్లో గెలుపొంది అప్పటి నుంచి వరుసగా మూడోసారి ఆ దేశ క్రికెట్ బోర్డు చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. ఇటీవల వెస్టిండీస్‌తో కలిపి టీ20 వరల్డ్‌కప్‌ను సమర్థవంతంగా నిర్వహించారు. క్రికెట్ క్రీడా ప్రపంచంలో వేణుగోపాల్‌రెడ్డి ఎంతో పేరు ప్రఖ్యాతలు సంపాదించడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఫీవర్ సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

● అధికారులకు మునిసిపల్ కమిషనర్ల ఆదేశం


డిండి మండల కేంద్రంలో జ్వర సర్వే నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

దేవరకొండ, హాలియా, జూలై 25: దేవరకొండ మునిసిపాలిటీ పరిధిలో ఇంటింటికి ఫీవర్ సర్వే నిర్వహించాలని దేవరకొండ మునిసిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రవి కోరారు. పట్టణంలోని మునిసిపల్ మునిసిపల్ కార్యాలయంలో గురువారం మెప్మా, వైద్య ఆరోగ్యశాఖ, వార్డు అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి ఇంటికి వెళ్లి ఇంట్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు చెప్పాలన్నారు. పాతడబ్బాలు, పూల కుండీలు, టైర్లలో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, నీటినిల్వ కారణంగా డెంగ్యూ, దోమల బెడద అధికమయ్యే ప్రమాదం ఉందని అన్నారు. సమావేశంలో డాక్టర్ అతియా అంజుం, డాక్టర్ కీర్తి, వైద్య అధికారులు నరహరి, కలీం, లింగయ్య, మెప్మా సిబ్బంది జగమంతు, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు, అధికారులు పాల్గొన్నారు.

వైద్యసిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలి

హాలియా: వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకొని హాలియా మునిసిపల్ కమిషనర్ ఎండీ మున్వర్‌అలీ అన్నారు. పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హాలియా మునిసిపాలిటీలోని 12 వార్డుల్లో ఉన్న ఇంటింటికి వెళ్లి వారి యొక్క ఆరోగ్య పరిస్థితులను తెలుసుకోవాలని సూచించారు. ఎవరికైనా జ్వరం వస్తే వారికి వైద్య సేవలు అందించాలన్నారు. అదే విధంగా ప్రతీ రోజు వారి వద్దకు వెళ్లి ఆరోగ్య పరిస్థితిని సమీక్షించాలని సూచించారు. కార్యక్రమంలో హాలియా మెడికల్ ఆఫీసర్ రామకృష్ణ, సీహెచ్‌వో మోతీలాల్, సూపర్‌వైజర్ ప్రమీల, వైద్య సిబ్బంది టీఎంసీజీ వసంత్‌కుమార్, వార్డు ఆఫీసర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

రామగిరి: ఆర్పీలు, ఆశావర్కర్లు ఫీవర్ సర్వేతో పాటు లార్వా సర్వే పకడ్బందీగా చేయాలని మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, జిల్లా మలేరియా అధికారి గంగప్ప ఆదేశించారు. నల్లగొండ మునిసిపల్ కార్యాలయంలో గురువారం ఫీవర్ సర్వేపై నిర్వహించిన ప్రత్యేక సమావేశాన్ని వారు మాట్లాడారు. ఫీవర్ సర్వే చేసిన ఇళ్లల్లో జ్వరంతో బాధపడే వ్యక్తులు ఉంటే వారి వివరాలు సేకరించాలని, వారికి వైద్య సేవలు అందించాలని అన్నారు. లార్వా నిల్వ ఉండే ప్రదేశాలను గుర్తించి వెంటనే వాటిని శుభ్రపరచాలని సిబ్బందికి సూచించారు. సమావేశంలో మెడికల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, మెప్మా సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

డిండి: అంటువ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రాథమిక వైద్యశాల వైద్యులు డాక్టర్ శైలిమా అన్నారు. మండలకేంద్రంలో గురువారం ఇంటింటి సర్వే నిర్వహించి జ్వర బాధితులను గుర్తించారు. 120 ఇళ్లను సర్వే చేయగా ఇద్దరు మాత్రమే జ్వరంతో బాధపడుతున్నట్లు ఆమె తెలిపారు. జ్వరంతో బాధపడేవారు ప్రాథమిక వైద్యశాలకు వచ్చి చికిత్స తీసుకోవాలని కోరారు. ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఆమె వెంట ఎంపీడీవో డానియేల్, పంచాయతీ కార్యదర్శి జంగయ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

వేముల నరేష్ కుటుంబానికి అండగా ఉంటాం

● నివాళులర్పించిన ఎమ్మెల్యేలు సామేలు, వీరేశం, బత్తుల


నరేష్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు, కళాకారులు

శాలిగౌరారం, జూలై 25: తెలంగాణ సాంస్కృతిక సారథి ఉమ్మడి జిల్లా మాజీ కన్వీనర్ వేముల నరేష్ కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యేలు మందుల సామేల్, వేముల వీరేశం, బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శాలిగౌరారం మండలం ఉట్కూరు గ్రామంలో గురువారం నిర్వహించిన నరేష్ సంస్మరణ సభకు వారు హాజరై మాట్లాడారు. తెలంగాణ కళాకారుడు సాయిచంద్ భార్య రజని మాట్లాడుతూ సమాజంలో మార్పును కోరుకునే వాళ్లే కళాకారులని, కళాకారులు వందేళ్లు బతకాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. ఏపూరి సోమన్న నరేష్ పిల్లలకు రూ.50 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు మధు, డేవిడ్, కళాకారులు వేముల పుష్ప, గిద్దె రామనర్సయ్య, సుక్క రామనర్సయ్య, నిర్మల, వసంత, మైకేల్ సీస్, చింతల యాదగిరి, మద్దెల సందీప్, ఎర్ర సూర్యం, అన్నెబోయిన సుధాకర్, వేముల గోపినాథ్, దేవరకొండ మస్తాన్, పుల్లూరి దేవేందర్, వేణు, లింగయ్య, జహంగీర్ పాల్గొన్నారు.

● శాలిగౌరారంలో ఇటీవల అనారోగ్యంతో కాంగ్రెస్ నాయకురాలు మామిడిపల్లి ప్రశాంత్ తల్లి మాధవి మృతి చెందింది. ఆమె కుమారుడైన ప్రశాంత్‌ను ఎమ్మెల్యే సామేల్ పరామర్శించి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. మాధవి చిత్రపటానికి ఎమ్మెల్యేలు సామేల్, వీరేశం, లక్ష్మారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలి

● ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ఆవుల సంపత్


నల్లగొండలో ఏబీవీపీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

నల్లగొండ టౌన్, జూలై 25: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్స్, స్కాలర్‌షిప్పుల బకాయిలను వెంటనే విడుదల చేయాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ జిల్లా కన్వీనర్ ఆవుల సంపత్ డిమాండ్ చేశారు. గురువారం సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని గడియారం చౌరస్తా వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగాన్ని తీవ్రంగా నిర్లక్ష్యం చేసిన గత ప్రభుత్వాన్ని యువత, విద్యార్థులు గద్దె దించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని అన్నారు. ఇంత వరకు విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం సిగ్గు చేటని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉండటంతో ఇంటర్, ఇంజనీరింగ్, డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు విద్యాసంస్థలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం విద్యారంగ సమస్యలన పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు వేసి భర్తీ చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేయాలని అన్నారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి గట్టిగొర్ల శివ కృష్ణ, సంయుక్త కార్యదర్శులు శివ, సాయి, మణికంఠ జోనల్ ఇంచార్జిలు మణి, సూర్య, కార్యకర్తలు విగ్నేష్, గణేష్, చందు, ప్రసాద్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి

హాలియా, పెద్దవూర, జూలై 25: సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను, జిల్లా నాయకుడు దొంతాల నాగార్జున డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టళ్ల అధ్యయన యాత్రలో భాగంగా గురువారం హాలియా, పెద్దవూర మండలాలలోని హాస్టళ్లలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హాస్టల్ వార్డెన్లు స్థానికంగా ఉండటం లేదని ఆరోపించారు. హాస్టల్‌లో కరెంట్ పోతే విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని అన్నారు. పాములు, తేళ్లు హాస్టల్ లోపలికి వస్తున్నాయని, హాస్టల్ మొత్తం 70 మంది విద్యార్థులు ఉంటే 30 మంది మాత్రమే ఉంటున్నారని మెనూ సక్రమంగా అమలు చేయడం లేదని ఆరోపించారు. హాస్టల్ ప్రారంభించి నెల రోజులవుతున్నా నేటికి నోట్‌బుక్స్, బట్టలు, దుప్పట్లు, ప్లేట్లు, గ్లాసులు ఇవ్వలేదన్నారు. కాస్మొటిక్ చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో కేవీపీఎస్ మండల అధ్యక్షుడు కొమ్ము జీవన్, నాయకులు దోరేపల్లి మల్లయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి

చిట్యాలరూరల్, మర్రిగూడ, చింతపల్లి, జూలై 25: ప్రతి ఒక్కరూ మొక్కలు వాటిని పరిరక్షించి పర్యావరణాన్ని కాపాడాలని పలువురు అధికారులు సూచించారు. జిల్లాలోని చిట్యాల, మర్రిగూడ, చింతపల్లి మండలాల్లో గురువారం వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మొక్కలు నాటి మాట్లాడారు. మానవాళి మనుగడ చెట్లతోనే ఆధారపడిందని అన్నారు. ప్రతీ ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని, మొక్కలు చెట్లుగా పెరిగి నీడను, ఎంతో విలువైన ప్రాణ వాయువును అందిస్తుందని అన్నారు. అంతేకాక వర్షాలు సంవృద్ధిగా పడేందుకు దోహదపడతాయన్నారు.

● చిట్యాల మండలంలోని ఉరుమడ్ల గ్రామంలో ఉరుమడ్ల మండల పంచాయతీ అధికారి సత్యనారాయణ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద మొక్కలు పంపిణీ చేసి మాట్లాడారు. గ్రామాల్లో చెట్లను పెంచి ప్రకృతిని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సిద్ధి వీరసోమయ్య, డాక్టర్ ఆర్.మాధవి, మర్రి రమేష్, బెలిజ అరుణ్‌కుమార్, శంకర్, అనురాధ, ఆశా వర్కర్లు, రైతులు, కూలీలు పాల్గొన్నారు.

● మర్రిగూడ మండలంలోని అజలాపురం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో మర్రిగూడ క్లస్టర్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యశోద మొక్కలు నాటారు. అనంతరం అమ్మ మాట బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. పిల్లలను అంగన్‌వాడీ పాఠశాలలో చేర్పించాలని అన్నారు. అనంతరం అజలాపురం గ్రామంలో గ్రీన్ కూలర్ డే నిర్వహించి చిన్నారులకు గ్రీన్ కలర్ దుస్తులను వేసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సెక్రటరీ శ్రీనివాస్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్, అంగన్‌వాడీ టీచర్ శోభ, జయమ్మ, ఆయాలు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

● చింతపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం సమీపంలో ఎంపీడీవో సుజాత మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వనమహోత్సవంలో భాగంగా సమాజంలోని ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. పిల్లలకు మెరుగైన వాతావరణం కోసం వాటిని సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌లో జిల్లాకు అన్యాయం

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డి


క్లాక్‌టవర్‌లో నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

రామగిరి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో నల్లగొండ జిల్లా అభివృద్ధికి నిధులు కేటాయించకుండా తీవ్ర అన్యాయం చేసిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ గురువారం స్థానిక క్లాక్‌టవర్‌లో నిరసన వ్యక్తం చేశారు. జిల్లాకు అధిక నిధులు కేటాయించి అభివృద్ధి కార్యక్రమాలు చేపడతారనకుంటే ప్రభుత్వం జిల్లా గాడిద గుడ్డు ఇచ్చిందని విమర్శించారు. ఉమ్మడి జిల్లా నుంచి కాంగ్రెస్ 11 మంది సీట్లు ఇస్తే జిల్లాకు కాంగ్రెస్ ఏమిచ్చిందని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు వీరెల్లి చంద్రశేఖర్, పోతేపాక సాంబయ్య, బీజేవైఎం ప్రధాన కార్యదర్శి రెవెల్ల కిరణ్, జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్, జిల్లా కార్యదర్శి బుడుగ భరత్, నాయకులు సాయి, కత్తుల సందీప్, దేవి, వంశీ, శ్రీకాంత్, రాఘవ, వెంకన్న, జనార్ధన్ గణేష్, సాయి, శ్రీకాంత్, కోటి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్ ఆశాజనకమే...

● ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉదావత్ లచ్చిరాం

రామగిరి, జూలై 25: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలకు ఆశాజనకంగానే ఉందని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉదావత్ లచ్చిరాం తెలిపారు. విద్యకు గత బడ్జెట్ కంటే ఈ బడ్జెట్‌లో కేటాయింపులు పెంచడం శుభ పరిణామమే కానీ మరింత కేటాయిస్తే బాగుండేది. అన్ని రంగాల్లో గత బడ్జెట్ కంటే ఈసారి బడ్జెట్‌లో కేటాయింపులు స్వల్పంగా పెరిగాయి.

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణను విస్మరించారు

కొండమల్లేపల్లి: కేంద్రం బడ్జెట్‌లో తెలంగాణను విస్మరించారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్.లక్ష్మీనారాయణ ఆరోపించారు. గురువారం కొండమల్లేపల్లిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రబడ్జెట్ బడా వ్యాపార వర్గాలకు అనుకూలంగా ఉందని ఆరోపించారు. ఉపాధి హామీ, గ్రామీణ అభివృద్ధి శాఖకు కేటాయింపులు ఏ మాత్రం పెంచలేదని విమర్శించారు. సమావేశంలో కంబాలపల్లి ఆనంద్, పెరికె విజయ్‌కుమార్, రాములు, ఎం.శ్రీను, కృష్ణయ్య, యాదయ్య, చిరంజీవి, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

బడ్జెట్‌లో బీసీలపై వివక్ష : బీజేపీ

మునుగోడు: ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బీసీలకు జనాభా ప్రాతిపదికన నిధులు కెటాయించకుండా వారిపై పూర్తి వివక్ష చూపిందని బీజేపీ అధికార ప్రతినిధి మాదగోని నరేందర్‌గౌడ్ విమర్శించారు. బీసీలకు కేటాయించిన బడ్జెట్ నిధులు కేవలం చాయ్ బిస్కెట్లు రావని ఎద్దేవా చేశారు.

కేంద్రానిది ఎన్డీఏ రాష్ట్రాల బడ్జెట్

కేతేపల్లి: కేంద్రం ప్రభుత్వ బడ్జెట్ ఎన్డీఏ రాష్ట్రాల బడ్జెట్‌లా ఉందని టీపీసీసీ ముస్లిం మైనార్టీసెల్ రాష్ట్ర కార్యదర్శి ఎండీ.యూసుఫ్ జాని విమర్శించారు. కేంద్రబడ్జెట్‌లో తెలంగాణకు తీరని అన్యాయం జరిగిందన్నారు. విభజన చట్టంలో పేర్కొన్న మేరకు తెలంగాణలో అనేక పథకాలకు నిధులు కేటాయించాల్సి ఉన్నా బీజేపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని అన్నారు. తెలంగాణ ప్రజల ఓట్లు, సీట్లు కావాలి తప్ప ఆ ప్రాంత అభివృద్ధి అక్కర లేదన్న చందంగా బీజేపీ వ్యవహరించిందని విమర్శించారు.

కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి మొండిచేయి: ఎస్ఎఫ్ఐ

హాలియా: కేంద్ర ప్రభుత్వం పెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి మొండి చేయి చూపించిందని, దేశంలో విద్యాభివృద్ధి కోసం కనీస నిధులు కూడా కేటాయించలేదని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్ అన్నారు. హాలియాలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బడ్జెట్‌లో ఇచ్చిన కేటాయింపుల ప్రస్తావన చేయకుండా ఉన్నత విద్యను ప్రైవేటుపరం చేసి, కార్పొరేట్‌కు ఊడిగం చేసేలా ఈ బడ్జెట్ ఉందన్నారు. బడ్జెట్‌ను సవరించి, విద్యాభివృద్ధి కోసం చర్యలు తీసుకొని నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు నల్లబెల్లి జగదీష్, కోరే రమేష్, జానీ, వర్షిత్, నాగరాజు, సంతోష్, చరణ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

'ఉద్యమకారుల సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలి'

నల్లగొండ టౌన్, జూలై 25: తెలంగాణ మలిదశ పోరాటంలో పాల్గొన్న ఉద్యమకారుల సమస్యలపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాలని, ఎన్నికల హామీలను అమలను చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ ముస్తాఫా కోరారు. పట్టణంలోని సంఘం కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమరవీరుల బలిదానాలతో, తెలంగాణ ఉద్యమ పోరాటాలు, త్యాగాలతో ఏర్పాటైన ప్రత్యేక రాష్ట్రంలో ఉద్యమకారులను కేసీఆర్ ప్రభుత్వం పదేళ్ల పూర్తిగా విస్మరించి అన్నారు. కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, పింఛన్ సౌకర్యాన్ని కల్పిస్తామని, ఆరు గ్యారెంటీల్లో భాగంగా హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఉద్యమకారులను గుర్తించడానికి ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేసి అర్హులైన వారందరికీ గుర్తింపుకార్డులు ఇవ్వాలన్నారు. ఉద్యమకారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా కన్వీనర్ దాసరి వెంకన్న నాయకులు అప్పలనాయుడు మధు, అవిశెట్టి రవి, ఊదరి ఆనంద్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం...

రామగిరి: నల్లగొండ మునిసిపల్ కౌన్సిల్ సమావేశం చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించనున్నట్లు కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ తెలిపారు. సమావేశానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. కౌన్సిల్ సభ్యులు సకాలంలో కావాలని కోరారు.

దేవరకొండ: ఎస్సీ వర్గీకరణను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 9వ తేదీన ఢిల్లీలో నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పోతం సహదేవుడు అన్నారు. దేవరకొండ రహదారి బంగ్లాలో చలో ఢిల్లీ మహాధర్నా పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు.

శాలిగౌరారం: ప్రజా సమస్యలను పరిష్కరించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండల వెంకన్న అన్నారు. మోదీ ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ జనరంజకమైనదని కొనియాడారు.

అడవిదేవులపల్లి, కట్టంగూరు, వేములపల్లి, మాడ్గులపల్లి, మిర్యాలగూడటౌన్: ప్రభుత్వానికి ముందస్తు అరెస్టుల మీద ఉన్న శ్రద్ధ రాష్ట్రంలోని నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై లేదని పలువురు బీజేవైఎం నాయకులు ఆరోపించారు. నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న బీజేవైఎం మండల నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు హామీ మేరకు జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని, నిరుద్యోగ భృతి చెల్లించాలన్నారు.

● అడవిదేవులపల్లిలో బీజేవైఎం మండల అధ్యక్షుడు పానుగోతు కోటేష్, రవీందర్, రమేష్ శంకర్, హనుమ, రాగ్యలను అరెస్ట్ చేశారు.

● కట్టంగూరులో అరెస్టు అయిన వారిలో బీజేపీ మండల అధ్యక్షుడు పబ్బు వెంకటేశ్వర్లు, నాయకులు నాగరాజు, భాస్కర్, హరిబాబు ఉన్నారు.

● వేములపల్లిలో బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పెదమాం భరత్, నాయకులు జవ్వాజి సత్యనారాయణ, వెంకన్న, రవి, మహేష్ ఉన్నారు.

● మాడ్గులపల్లిలో అరెస్ట్ అయిన వారిలో బీజేపీ మండల అధ్యక్షుడు బొమ్మకంటి నరసింహ, బీజేవైఎం మండల అధ్యక్షుడు దారమళ్ల నాగరాజు, నాయకులు ఇటికాల జాన్‌రెడ్డి, యాదగిరి, శంకర్ ఉన్నారు.

● మిర్యాలగూడలో అరెస్ట్ అయిన వారిలో బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి చిల్లంచర్ల అభి, జిల్లా ఉపాధ్యక్షుడు నేరెళ్ల అజయ్, మేడి నవీన్, చిత్రాల అజయ్, మోదాల అశోక్, అక్షయ్, రాజు ఉన్నారు.

చండూరు: ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్ష పదవి చండూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉన్న ఆర్యవైశ్యులకు అవకాశం కల్పించాలని ఆ సంఘం నాయకులు తేలుకుంట్ల జానయ్య, మంచుకొండ సంజయ్, తేలుకుంట్ల శేఖర్ తదితరులు కోరారు.

డిండి: దళితుల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పొందుపరిచిన అంబేడ్కర్ అభయహస్త పథకానికి నిధులు మంజూరు చేయాలని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ముదిగొండ ఎల్లేష్‌మాదిగ ప్రభుత్వాన్ని కోరారు.

చిట్యాల: ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడిగా దేవనబోయిన సైదులు ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా దేవనబోయిన సైదులు, ప్రధాన కార్యదర్శి కూరాకుల సుధీర్, కోశాధికారిగా చొప్పరి లింగస్వామి, సభ్యులుగా సిలివేరు కృష్ణ, యాదగిరి ఎన్నికయ్యారు.

పెద్దఅడిశర్లపల్లి: టీఎమ్మార్పీఎస్ గుడిపల్లి మండల అధ్యక్షుడిగా ఎర్ర వంశీ నియమితులయ్యారు. ఈ సందర్భంగా వంశీ మాట్లాడుతూ సంఘం బలోపేతం చేయడంతో పాటు జాతి ప్రయోజనాలు, జాతి ఐక్యత కోసం ఉద్యమంలో ముందుండి పోరాటం చేస్తానన్నారు.

చిట్యాలరూరల్: చిట్యాల మండలంలోని చిట్యాల లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు పలువురు రాజీనామా చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సహాయకార్యదర్శి ఎస్‌కె. అక్రమ్ మాట్లాడుతూ లారీ ఓనర్లమైన తమకు న్యాయం జరగడంలేదని, అందుకే పదవులకు రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. రాజీనామా చేసిన వారిలో మల్లేశం, వై.వినోద్, రావుల చినమల్లారెడ్డి, ఊషయ్య, మల్లారెడ్డి, కరుణాకర్‌రెడ్డి ఉన్నారు.

మునుగోడు: జాతీయ ఉపాధి హామీ పథకం కూలీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 29వ తేదీన కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బొల్గూరి నర్సింహ పిలుపునిచ్చారు.

పెద్దఅడిశర్లపల్లి: మండలంలోని మేడారం గ్రామ శివారులోని 276 సర్వే నెంబర్‌లోని ఎకరం భూమిలో 33/11 కేవీవిద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థలాన్ని గురువారం దేవరకొండ ఆర్డీవో శ్రీరాములు పరిశీలించారు.

పామాయిల్ కోసం పరుగోపరుగు

● బిందెలు, బకెట్లతో వచ్చిన స్థానికులు

మిర్యాలగూడ, జూలై 25: ట్యాంకర్ నుంచి లీక్ అవుతున్న పామాయిల్‌ను తీసుకెళ్లేందుకు స్థానికులు బిందెలు, బకెట్లతో ఎగబడ్డారు. ఈ సంఘటన మిర్యాలగూడలో గురువారం చోటుచేసుకుంది. 24 వేల లీటర్ల పామాయిల్(ఫిల్టర్ కానిది) లోడుతో ఆయిల్ ట్యాంకర్ (ఏపీ21 టిజడ్ 7519) నెల్లూరు నుంచి జడ్చర్ల షాద్‌నగర్‌కు వెళ్తోంది. అద్దంకి వద్ద ట్యాంకర్ వాల్వ్ నుంచి ఆయిల్ కారడం ప్రారంభమైంది. దానికి మరమ్మతులు చేసి బయలుదేరారు. రాత్రి 8 గంటలకు మిర్యాలగూడలో సాగర్ రోడ్డులోని రైల్వే ట్రాక్ వద్దకు రాగానే వెనుక భాగంలో వాల్వ్ వద్ద తిరిగి లీకవడంతో రోడ్డుపై కొంత దూరం పామాయిల్ నూనె పడింది. ట్యాంకర్ నుంచి పామాయిల్ లీక్ అవుతుందని తెలుసుకున్న వెంకటాద్రిపాలెం శివారు ప్రజలు, చుట్టుపక్కల దుకాణదారులు బకెట్లు, బిందెలతో ట్యాంకర్ వద్దకు పరుగులు తీశారు. ట్యాంకర్ వాల్వ్ వద్ద మరమ్మతు చేసున్న ట్యాంకర్ డ్రైవర్, క్లీనర్‌ను పక్కకు నెట్టి పామాయిల్ పట్టుకునేందుకు జనం ఎగబడ్డారు. వంటల్లో వాడడానికి ఫిల్టర్ కాని పామాయిల్ పనికిరాదని చెప్పినా జనం వినిపించుకోకుండా నూనె కోసం ఎగబడ్డారు. ట్యాంకర్ డ్రైవర్ 100కు కాల్ చేసి సమాచారం ఇవ్వడంతో రూరల్ పోలీసులు అక్కడికి చేరుకున్నారు. వంటకు పనికిరాదని అందరికీ అరిచి చెప్పడంతో ఒక్కొక్కరు అక్కడి నుంచి జారుకున్నారు. ఈ ఘటనపై ఎలాంటి కేసు నమోదు చేయలేదని పోలీసులు తెలిపారు.